

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	36	23
భద్రాద్రి కొత్తగూడెం	35	22

భద్రాద్రి పుణ్యక్షేత్ర అభివృద్ధిపై భక్తులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం రామక్షేత్ర అభివృద్ధిపై హామీలతో సరిపెట్టడంతో తాజాగా రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంపైనే భక్తులు ఆశలు పెట్టుకున్నారు. 17వ శతాబ్దంలో భక్తరామదాసు భద్రాద్రి రామాలయాన్ని నిర్మించగా.. 1965లో నాటి అవసరాల నేపథ్యంలో పునరుద్ధరణ పనులు చేపట్టారు. అయితే కాలక్రమేణా రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు రామయ్యను దర్శించేందుకు వస్తుండటంతో ఆలయ విస్తరణ అనివార్యంగా మారింది. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉప ఆలయాలను విస్తరించాల్సి వుంది. అలాగే రామాలయ అనుబంధ ఆలయమైన శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రోప్‌వే, ప్రధాన ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీని తట్టుకునేందుకు శాశ్వత క్యూలైన్లను ఏర్పాటు చేయాల్సి ఉంది.



దక్షిణ అయోధ్య
దశ తిరిగేనా?

- బడ్జెట్‌లో ప్రకటనతోనే నిలిచిన రూ.150 కోట్ల నిధులు
- శాశ్వత మాస్టర్‌ప్లాన్‌పై దృష్టిసారిస్తేనే ఆలయ సమగ్రాభివృద్ధి
- సీఎం రేవంత్‌రెడ్డిపైనే భక్తుల ఆశలు

భద్రాచలం, మార్చి 6: భద్రాద్రి రామాలయంలో ప్రధానంగా స్వామివారికి నిర్వహించే నిత్యకల్యాణానికి ప్రత్యేక మండపం ఏమీ లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఆలయ ప్రాంగణంలోనే కల్యాణాన్ని నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వారాంతపు సెలవుల్లో 200 జంటలు నిత్యకల్యాణంలో పాల్గొంటే ఆలయంలో తీవ్ర రద్దీ ఏర్పడుతోంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే కనీసం 500 జంటలు పాల్గొనేలా మండపాన్ని నిర్మించాల్సి ఉంది. అలాగే నిత్యాన్నదాన సత్రానికి కూడా ప్రతిరోజు అధిక సంఖ్యలో భక్తులు వస్తుండటంతో కొన్ని సమయాల్లో మధ్యాహ్నం మూడు దాటిన తరువాత కూడా భోజనాలు కొనసాగుతున్నాయి.

ఈ క్రమంలో కనీసం మూడువేల మంది భోజనం చేసేలా అధునాతన సౌకర్యాలతో అన్నదాన సత్రంను నిర్మించాల్సి ఉంది. ఇక ఏటా శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం నిర్వహించే మిథిలా స్టేడియాన్ని పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం మిథిలా స్టేడియంలో సుమారు 40వేల మంది భక్తులు మాత్రమే కల్యాణాన్ని వీక్షించే వెసులుబాటు ఉంది.

ఏటా భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో తాత్కాలిక వసతులకోసం లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా గతంలో మాడ వీధుల అభివృద్ధి కోసం ఆలయం చుట్టూ పరిసరాల్లో పలు ఇళ్లకు పరిహారం చెల్లించి ఖాళీ చేయించేందుకు గతంలో ప్రభుత్వం ప్రయత్నం చేసింది. అయితే కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆ ప్రయత్నం ముందుకు సాగలేదు.



భద్రాద్రి అభివృద్ధిపై మాటలకే పరిమితమైన గత ప్రభుత్వం

మాటలకే పరిమితం

రాష్ట్రంలో గత పదేళ్లలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం భద్రాద్రి రామాలయ అభివృద్ధిపై మాటలకే పరిమితమైంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం అప్పటి ప్రభుత్వం యాదాద్రి అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వగా అనంతరం యాదాద్రి తరహాలోనే భద్రాద్రిని అభివృద్ధి చేస్తామంటూ ప్రకటనలు గుప్పించింది.ఈ క్రమంలో 2017 అక్టోబర్‌లో భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనుల రూపశిల్పిగా ఆనంద్‌సాయిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో శిల్పి ఆనంద్‌సాయి, దేవాదాయ శాఖ స్థపతి, ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మాస్టర్ ప్లాన్‌ను సైతం రూపొందించారు. వాస్తవానికి గత ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ మంత్రిగా పనిచేసిన తుమ్మల నాగేశ్వరరావు తొలి నుంచీ భద్రాద్రి ఆలయాభివృద్ధికి కృషిచేసినా నాటి సీఎం నుంచి సరైన స్పందన రాలేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో రెండు విడతల్లో రూ.150కోట్లు కేటాయించినా నిధులు మాత్రం విడుదల చేయలేదు.

సీఎం రేవంత్‌పైనే ఆశలు

రాష్ట్ర ఆవిర్భావం నుంచీ అభివృద్ధికి నోచుకోని భద్రాద్రి ఆలయంపై ప్రస్తుత సీఎం ఎ.రేవంత్‌రెడ్డి దృష్టిసారించనుండటంతో భద్రాద్రి రూపురేఖలు మారే అవకాశం ఉందని భక్తులు భావిస్తున్నారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి 11న భద్రాద్రికి విచ్చేస్తుండడంతో ఆలయ అభివృద్ధిపై అధికారికంగా ప్రకటన చేసే అవకాశముందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో బుధవారం భద్రాద్రి దేవస్థానం అధికారులతో మంత్రులు సమావేశం నిర్వహించడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ పరిస్థితుల్లో రాబోయే రోజుల్లో భద్రాద్రి ఆలయ అభివృద్ధికి మార్గం సుగమం కానుందని రామ భక్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

భద్రాద్రిపై సమగ్ర ప్రణాళికలతో రండి


- నిధులిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి
- హైదరాబాద్‌లో భద్రాద్రి దేవస్థానం అధికారులతో సమీక్ష

4



రామాలయ అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రులు





సిద్ధమవుతున్న వేదిక

'కారు' జోరందుకునేనా!?

లోక్‌సభ ఎన్నికలకు బీఆర్‌ఎస్ సన్నాహాలు

- నేడు నగరంలో ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశం
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజుకు అభినందన సభ
- హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఖమ్మం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడిజిల్లాలో ఘోర పరాజయం చూసిన బీఆర్‌ఎస్ పార్టీ ఆ ఓటమిని మరిచిపోయి తాజాగా లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బతిన్నా లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని ముందస్తుగానే ఎన్నికల ప్రచార బరిలోకి దిగింది. ఇప్పటికే లోక్‌సభ ఖమ్మం అభ్యర్థిగా నామా నాగేశ్వరరావు పేరును ప్రకటించిన నేపథ్యంలో ఖమ్మం వేదికగానే లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి బీఆర్‌ఎస్ శ్రీకారం చుట్టబోతోంది.

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలతో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఖమ్మంలోని వీవీసీ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుంది. ఈ సమావేశంలో పార్టీ నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలుసుకోనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఒక్కటికూడా గెలవలేదు. మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో ఒక్క భద్రాచలంలోనే బీఆర్‌ఎస్ విజయం సాధించింది. అయితే భద్రాచలం ఎమ్మెల్యే వెంకటరావు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఒక వేళ ఆయన పార్టీ మారితే ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి అసెంబ్లీలో బీఆర్‌ఎస్‌కు ప్రాతినిధ్యం ఉండదు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, కేడర్‌ను నమ్ముకునే బీఆర్‌ఎస్ ఎన్నికల బరిలో దూకబోతోంది.

అసెంబ్లీ పోరులో 'హస్తం'దే హవా..

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్, కొత్తగూడెంలో కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ గెలిచింది. ఈ ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 2,66,162ఓట్ల ఆధిక్యత లభించింది. పాలేరు, ఖమ్మం, మధిర, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాల్లో కాంగ్రెస్, సీపీఐ కూటమికి 7,33,293ఓట్లు లభించాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థులకు 4,67,431 ఓట్లు లభించాయి.

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో భద్రాచలం, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు 2,47,214 ఓట్లు లభించగా, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు 1,61,118 ఓట్లు లభించాయి. కాంగ్రెస్‌కు 86,096 ఓట్ల ఆధిక్యత లభించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీనుంచి ఖమ్మంలో పోటీ చేసిన నామ నాగేశ్వరరావుకు 5,67,459 ఓట్లు లభించగా, కాంగ్రెస్ అభ్యర్థి రేణుకాచౌదరికి 3,99,397 ఓట్లు లభించాయి. అప్పుడు నామాకు సుమారు 1,68,062ఓట్ల మెజారిటీ లభించింది. అయితే గత లోక్‌సభ ఎన్నికలకు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సీన్ మొత్తం మారింది.

2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో ఖమ్మం నుంచి మాత్రమే బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ గెలవగా మిగిలిన 6నియోజకవర్గాల్లో కాంగ్రెస్, టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఉమ్మడి జిల్లాలో గెలుపొందిన కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో 2019లోక్‌సభ ఎన్నికల్లో నామా నాగేశ్వరరావుకు భారీ ఆధిక్యత లభించింది. ఇప్పుడు బీఆర్‌ఎస్‌కు సైతం స్థానికంగా ఎమ్మెల్యేలు లేకపోవడం,

మిగతా 4వ పేజీలో...

'నామా' విజయం అందరి బాధ్యత

- ఎల్‌ఆర్‌ఎస్‌ను కాంగ్రెస్ ఉచితంగా అమలు చేయాలి
- నేటి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

4



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధుసూదన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్ సింగ్ ఠాగూర్, పోటు రంగారావు, సుభాష్ దేబ్

బూర్జువా పార్టీలతో పొత్తు ఉండదు

- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌లను ఓడించాలి
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రతినిధుల స్పష్టీకరణ
- జాతీయ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన పోటు రంగారావు

4

మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

ఖమ్మం మార్కెట్, మార్చి 6: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 8, 9, 10 తేదీలు వరుసగా మూడు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఈనెల 8న శుక్రవారం శివరాత్రి సందర్భంగా, 9, 10 తేదీలు శని, ఆదివారాలు సెలవులు ఉన్నట్లు తెలిపారు. ఇక 11వ తేదీనుంచి క్రయవిక్రయాలు యథావిధిగా ఉంటాయని తెలిపారు.



డేంజర్ లెవల్‌కు పాలేరు జలాశయం

కూసుమంచి, మార్చి 6: పాలేరు జలాశయం అడుగంటుతోంది. పూర్తిస్థాయి సామర్థ్యం 23 అడుగుల నీటిమట్టం కాగా, బుధవారం రాత్రికి 11.4 అడుగులకు చేరుకుంది. మరో రెండు అడుగుల నీటిమట్టం తగ్గితే ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉంది. ఒక అడుగు తగ్గితే పాకుడుపట్టిన నీరు వచ్చే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో నాగార్జున సాగర్ డ్యామ్ నుంచి నీటి విడుదలకు తీసుకోవాల్సిన చర్యల కోసం రాష్ట్రప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు నీటిపారుదల, మిషన్ భగీరథ అధికారులు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'గృహజ్యోతి' పథకం (కరెంటు)లో జీరో బిల్లుల జారీలో గందరగోళం నెలకొంది. అర్హులందరికీ జీరో బిల్లులు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తూ విద్యుత్ అధికారులను నిలదీస్తున్నారు. అధికారులేమో గతంలో ఇచ్చిన ప్రజాపాలన దరఖాస్తు నెంబరు, ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డు, మీకు వచ్చిన కరెంటు బిల్లు జిరాక్స్‌లను ఒక అప్లికేషన్‌కు జతచేసి మళ్లీ మండలానికి చెందిన వారు మండల పరిషత్‌లో, మునిసిపాలిటీకి చెందిన వారు మునిసిపల్ ఆఫీసులో అందజేయాలని చెబుతున్నారు. దీంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు.

జీరో బిల్లుల పరేషాన్



జీరోబిల్లు రాలేదని చూపెడుతున్న మహిళ

- అర్హులందరికీ అందని వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న జనం
- వివరాలు తప్పుగా నమోదు చేయడమే కారణం
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటున్న అధికారులు

మధిర, మార్చి 6: నెలకు 200 యూనిట్ల లోపు కరెంటు వినియోగదారులందరూ ఇటీవల జరిగిన ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు చేసుకున్నారు. గత నెలలో కరెంట్ శాఖ వారు అన్ని మండలాల్లో ఇంటింటికి వెళ్లి తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, కరెంట్ మీటర్‌రీడింగ్ ఆధారంగా వెరిఫైచేసుకున్నారు. దరఖాస్తుల్లో మీటర్ నెంబర్లు తప్పుగా రాసినవారి నెంబర్లు సరిచేసుకొని మళ్లీ తీసుకున్నారు. అంతాబాగానే ఉంది. ఈనెల మార్చి నెల బిల్లులు జీరోలో జారీ చేస్తున్నారు. అయితే జీరో బిల్లులు అందరికీ రావడంలేదు. చాలా మందికి ఎప్పటిలాగే కరెంటు బిల్లులు డబ్బులు కట్టాలని రావడంతో ఆందోళన చెందుతూ కరెంట్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు తలో రకంగా సమాధానం చెబుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.. మళ్లీ దరఖాస్తు కుంటే జీరోబిల్లులు సరిచేస్తామని చెబుతుండటంతో జీరో బిల్లులు రాని వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రజాపాలనలో చాలా మంది కరెంట్ మీటర్ నెంబరుగా యూనిక్ నెంబర్‌కు బదులు సర్వీస్ నెంబర్లు పేర్కొన్నారు. కొందరు అవి కూడా తప్పుగా రాశారు. కొన్ని ఆన్‌లైన్ చేసేటప్పుడు తప్పుగా పడ్డాయి. ఇవన్నీ అర్హత ఉన్నా జీరో బిల్లులు రాలేదు. కరెంట్ మీటర్ నెంబర్లు సరిచేసిన కరెంటు వారి వీరి లిస్టు కాకుండా తప్పులు సరిచేయని ప్రజాపాలన దరఖాస్తులనే ప్రామాణికంగా తీసుకొని జీరో బిల్లుల లిస్టు ఫార్మెట్ చేయడంతో అందరికీ జీరో బిల్లులు రాలేదు. ఇలా ఒక్కో గ్రామంలో వందలాది మంది అర్హత ఉన్నా జీరో బిల్లులు రాని వారు ఉన్నారు. దీంతో అనేక మంది జీరో బిల్లులు వస్తాయో లేదో అని ఆందోళన చెందుతున్నారు.

ఇంటింటికీ వెళ్లి పరిశీలించినా...

ప్రజాపాలన దరఖాస్తుల్లో చాలా మంది కరెంట్ మీటరు నెంబర్లు తప్పుగా రాశారు. దీంతో గత నెల కరెంట్ మీటర్ రీడింగ్‌తో పాటు ఇంటింటికి వెళ్లి తప్పుగా రాసిన నెంబర్లను సరిచేశారు. అందుకు ఆధార్ కార్డు, తెల్లరేషన్‌కార్డు, మీటర్‌రీడింగ్‌ను తనిఖీలు చేశారు. అంతేకాక రీడర్లు ఇంటికి వెళ్లిన సమయంలో ఇండ్లలోలేని వారు ఉంటే కరెంట్ ఆఫీసులో అన్ని ఆధారాలతో అందజేయాలంటే అలా చాలా మంది ఇచ్చారు. వీటి ఆధారంగా కరెంట్ శాఖ ఒక లిస్టు తయారు చేసింది. అయితే జిల్లానుంచి వచ్చిన జీరో బిల్లుల ఫార్మెట్ అంతా ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా అర్హత ఉన్న వారికే వచ్చింది. దీంతో అసలు సమస్యఏర్పడి గందరగోళంగా మారింది.

పామాయిల్ రైతులకు ఆర్థిక తోడ్పాటు

డీసీసీబీ సీఈవో రెహమాన్

అశ్వారావుపేట/దమ్మపేట, మార్చి 6: పామాయిల్ రైతులకు డీసీసీబీ ద్వారా ఆర్థిక తోడ్పాటు పెంచుతున్నట్లు డీసీసీబీ సీఈవో అబ్దుల్ రెహమాన్ తెలిపారు. అశ్వారావుపేట, దమ్మపేట సొసైటీ కార్యాలయాల్లో మంగళవారం ఆయా సొసైటీల అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, ఎల్లిన రాఘవరావు అధ్యక్షతన జరిగిన పామాయిల్ రైతుల సమావేశంలో సీఈవో రెహమాన్ మాట్లాడుతూ రైతులకు పంట రుణాల కింద రూ.3లక్షల వరకు డీసీసీబీ మంజూరు చేస్తుందన్నారు. కొత్తగా పామాయిల్ సాగు చేసేవారికి ఎకరాకు రూ.1.35లక్షలు రుణం అందిస్తామన్నారు. ఇతర బ్యాంకులకంటే మెరుగైన రుణ సదుపాయం అందిస్తే రైతులకు మేలు జరుగుతుందని సొసైటీ డైరక్టర్ బత్తిన పార్థసారధి, రైతులు కె.పుల్లయ్య, ఆళ్ల నాగేశ్వరరావు, తుమ్మా రాంబాబు సీఈవోకు విజ్ఞప్తి చేశారు.

బతుకమ్మ చీరల పంపిణీ ఎప్పుడో ?

» ఎన్నికల కోడ్ ఎత్తేసి నాలుగు నెలలవుతున్నా పేదలకు పంపిణీ కాని వైనం » ప్రభుత్వం మారడంతో కదలిక లేని చీరల పంపిణీ

మధిర, మార్చి 6: ప్రతి ఏడాది దసరా పండుగకు మహిళలకు ఇచ్చే బతుకమ్మ చీరలు ఎన్నికల కోడ్ కారణంగా పంపిణీ కాక లక్షలాది చీరలు రేషన్ దుకాణాల్లో మగ్గుతున్నాయి. ఎన్నికలు కోడ్ ముగిసి నాలుగు నెలలు కావస్తున్నా అధికారులు చీరల పంపిణీ చేపట్టడం లేదు. చీరల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది చీరెలు ఎక్కడి చీరలు అక్కడే మూలుగుతున్నాయి. ప్రభుత్వం మారడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు పేదలకు చెందకుండా కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఏడాది పేదలకు చీరెలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి దసరా పండుగకు బతుకమ్మ చీరల పంపిణీకి ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. పాత పథకమే అయినా కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం చెప్పడంతో ఎన్నికల కమిషన్ చీరల పంపిణీని నిలిపేసింది. అప్పటికే దసరా పండుగకు కొన్ని ప్రాంతాల్లో సగం వరకు చీరల పంపిణీ చేశారు. ఇంకా సగం చీరలు పంపిణీ ఎన్నికలు అయిన తర్వాత డిసెంబర్‌లో పంపిణీ చేసుకోవచ్చని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. మిగిలిన సగం మంది మహిళలకు చీరలు పంపిణీ జరగలేదు. ఎన్నికలు ముగిశాయి. కోడ్ నిబంధనలు ఎత్తి వేశారు. అయినా చీరలు పంపిణీ జరగక ఎక్కడి చీరలు అక్కడే మురిగిపోతున్నాయి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో చీరల పంపిణీ గురించి పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ చీరలు పంపిణీ చేస్తే కేసీఆర్ చీరలనే ప్రచారం ప్రజల్లోకి వెళ్తుందనే ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం నేతలు వీటిని వదిలేశారని తెలుస్తోంది. గోడౌన్లలో మూలుగుతున్న లక్షలాది చీరల సంగతేంటని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అధికారులు కూడా సాహసించడంలేదు. 90శాతం చీరలు దసరాకు ముందు పంపిణీకి దుకాణాలకు, మండల కార్యాలయాలకు పంపగా, ఇంకా పది శాతం చీరలు జిల్లా కేంద్రాల్లోని టీసీఎస్ గోడౌన్లలోనే ఉన్నాయి. ఇక చౌకధరల దుకాణాలకు పంపిణీ చేసిన వాటిల్లో కొన్ని చోట్ల సగం, కొన్ని చోట్ల మూడోవంతు చీరలు పంపిణీ కాకుండా ఆగిపోయాయి. అవి ఇప్పటికీ ఆయా దుకాణాల్లో మూలనపడి ఉన్నాయి.

జిల్లా అధికారిక లెక్కల ప్రకారం.. ఒక్క ఖమ్మం జిల్లాకు అక్టోబరులోనే 4,26,500 చీరలు వచ్చాయి. వీటిలో 3,80,625చీరలు మండలాలకు పంపిణీ కోసం సరఫరా చేశారు. ఇంకా గోడౌన్లలో 45,955 చీరలు అలానే ఉన్నాయి. ఇవి కాకుండా మండలాలకు వెళ్లిన చీరల్లోనూ సగం వరకు పంపిణీ జరక్క మండల తహసీల్దార్ కార్యాలయలు, రేషన్ దుకాణాల్లో మూలుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితే రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. ఈ చీరలను పంపిణీ చేస్తే పేద మహిళలకు కొంతమేరకు ఉపయోగంగా ఉంటుంది. ప్రభుత్వం మారినందున ఈచీరల పంపిణీపై ఎలాంటి కదలిక లేకుండా పోయింది.



ఓ రేషన్ దుకాణంలో పంపిణీ కాకుండా ఉన్న నాలుగు వందల బతుకమ్మ చీరలు

డీపీఎం దర్గయ్యను వివరణ కోరగా జిల్లాలో పంపిణీ కాకుండా మిగిలిన ఉన్న చీరల పంపిణీ విషయమై ప్రభుత్వం నుంచి తమకుఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిపారు. పంపిణీ కావాల్సిన చీరల సమాచారం మండలాల నుంచి పూర్తిగా రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమగ్ర ప్రణాళికలతో రండి

● డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

భద్రాచలం, మార్చి 6: భద్రాచలం ఆలయాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలతో వస్తే నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లుభట్టివిక్రమార్క తెలిపారు. భద్రాచలంలో సీఎం పర్యటన నేపథ్యంలో రాష్ట్ర సచివాలయంలో బుధవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి భద్రాచలం ఆలయాభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవాలయం చుట్టూ రెండు ప్రాకారాలు, రోడ్ల నిర్మాణానికి అధికారుల వద్ద ఉన్న ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. గతంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను సమీక్షించారు. ఈ నెల 11న సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటన, స్వామివారి దర్శనం నేపథ్యంలో ఏర్పాట్ల గురించి మంత్రులు సమీక్ష చేశారు. ఇంజనీరింగ్, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. శ్రీరామనవమి, పట్టాభిషేకం, ముక్కోటి ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ అధికారులను మంత్రులు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కూరాకుల జ్యోతి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మల్లికార్జునరెడ్డి, స్థపతి, దేవాదాయశాఖ సలహాదారు శ్రీవల్లినాయగం, ఆర్డీవో దామోదర్‌రావు, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పాల్గొన్నారు.

కిన్నెరసాని వైల్డ్ లైఫ్ ఎఫ్‌డీవోగా బాబు నియామకం



ఎఫ్‌డీవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న యూనియన్ సభ్యులు

పాల్వంచ, మార్చి6: కిన్నెరసాని వన్యప్రాణి సంరక్షణ విభాగం(వైల్డ్ లైఫ్) ఎఫ్‌డీవోగా భూక్యా బాబు నియమితులయ్యారు. బుధవారం పాల్వంచలోని వైల్డ్ లైఫ్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన ఎఫ్‌డీవో దామోదర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిగిన బదిలీల్లో పాల్వంచ టెరిటోరియల్ ఎఫ్‌డీఓగా బది లీ అయ్యారు. అప్పటి నుంచి ఆ విధులను భద్రాద్రి జిల్లా డీఎఫ్ఓ కిష్టాగౌడ్ ఇన్‌చార్జి బా ధ్యతలతో పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం మంగళవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేయడంతో కిష్టాగౌడ్ నుంచి భూక్యా బాబు బాధ్యతలు స్వీకరించారు.

నగరపాలకసంస్థలో కాంట్రాక్టర్ల బిల్లుల లొల్లి

ఖమ్మంకార్పొరేషన్, మార్చి6: గతంలో నగరపాలకసంస్థ పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులో తీవ్రజాప్యం జరగడంతో వారు ధర్నాలు నిర్వహించారు. తమకు రావాల్సిన బిల్లులు ఇవ్వకుంటే పనులు చేయమని నగరపాలకసంస్థ కాంట్రాక్టర్లు బుధవారం నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెల 13నుంచి ఎటువంటి అభివృద్ధి పనులు చేయకూడదని నిర్ణయించారు.

నగరపాలకసంస్థ కాంట్రాక్టర్లకు రూ.35కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.22కోట్ల విలువైన పనులు చేయగా, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పనులకు సంబంధించి రూ.2.50కోట్లు, నగరపాలకసంస్థ సాధారణ నిధులతో చేయించిన పనులకు సంబంధించి రూ 10.50కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యవసర పనుల కింద చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించకపోవటంతో కాంట్రాక్టర్లు ఆర్థిక కష్టాలకు గురవుతున్నారు. గత నెలాఖరులోనే కొంతమేర బిల్లులు చెల్లిస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు 13 నుంచి పనులు నిలిపివేయాలని నిర్ణయించారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు నిర్వహించిన నేపథ్యంలో, విజిలెన్స్ అధికారుల నుంచి నివేదిక వచ్చిన తరువాతే బిల్లులు చెల్లిస్తామని కమిషనర్ స్పష్టం చేయటంతో కాంట్రాక్టర్లు ఆవేదనకు గురవుతున్నారు.

ఖమ్మం జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 6: వరంగల్‌లో ఈనెల 8 నుంచి 10 వరకు జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొనే జిల్లా హ్యాండ్‌బాల్ జట్టును బుధవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 48 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు ప్రకటించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జూలూరుపాడు, మార్చి6: సౌత్ ఇండియన్ స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని పడమటనర్సాపురం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. హైదారాబాద్‌లోని యూసఫ్‌గూడలో కల్యాణి కరాటే అకాడమీ వారి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన పోటీలలో అండర్-14 కటాస్ విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు జి.తనీల, డి.భూమిక, బి.ఐశ్వర్య, కె.మనీషాలు పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్‌ను సాధించారు. బి.దివ్య ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించింది. ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం రవికుమార్, కరాటే కోచ్ గత్తం శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయుడు బావ్‌సింగ్‌లతో పాటు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పగిడిద్దరాజు జాతర ప్రారంభం

గుండాల, మార్చి 6: మేడారం సమ్మక్క భర్త పగిడిద్దరాజు యాపలగడ్డ గ్రామానికి చెందిన అరెం వంశీయుల ఇలవేల్పు. బుధవారం పగిడిద్దరాజును బర్ల గుట్ట నుంచి వేపలగడ్డలోని ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు అప్పయ్య, లక్ష్మీనర్సు, లచ్చుపటేల్, కాంతారావు, చిన్న కాంతారావు, లక్ష్మయ్య తదితరులున్నారు.

సేవా దృక్పథంతో పనిచేయాలి

» ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర రెడ్డి

పాల్వంచ టౌన్, మార్చి6: సామాజిక సేవా దృక్పథంతో పని చేస్తూ మనం పదిమందికి మార్గదర్శకంగా నిలవాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. దామోదరరెడ్డి అన్నారు. బుధవారం పాల్వంచ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జాతీయ పెన్షనర్స్‌డే వేడుకలను నిర్వహించారు. అదేవిధంగా పెన్షనర్స్ పితామహుడు, మార్గదర్శి డీఎస్. నఖారా విగ్రహావిష్కరణను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం పెన్షన్ సౌకర్యంతోపాటు పలు సౌకర్యాల కల్పన కోసం పోరాడి మనకు హక్కులు కల్పించిన మహానీయుడు డీఎస్.నఖారా అని కొనియాడారు. అనంతరం పలువురు సంఘ బాధ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు వెస్లీ, సంఘ అధ్యక్షులు చింతోజు బ్రహ్మారావు, కార్యదర్శి ఆర్‌వి. రావు, పాల్వంచ యూనిట్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కే. రాఘవేంద్రరావు, కార్యదర్శి ఎండి. షాబుద్దీన్‌ఖాన్, ట్రెజరర్ కన్నయ్య, అక్కినేని కోటయ్య, మోహన్ రెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర రెడ్డి

'కారు' జోరందుకునేనా!?

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గట్టి సవాల్‌ను ఎదుర్కోబోతోంది. జిల్లానుంచి కాంగ్రెస్‌కు రాష్ట్ర క్యాబినెట్‌లో ముగ్గురు మంత్రులతోపాటు ఒక రాజ్యసభ సభ్యురాలు కూడా ఉన్నారు. దీనికి తోడు ఎమ్మెల్యేల బలం కూడా కాంగ్రెస్‌కు ఉంది. బీఆర్ఎస్‌కు ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ఒక ఎమ్మెల్సీ ఒక జడ్పీ చైర్మన్ మాత్రమే ఉన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే బీఆర్ఎస్‌కు ఉన్నా ఆయన ఎటువైపు పనిచేస్తారన్నది మిస్టరీగా ఉంది.

ఇటీవలే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ కూడా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ గూటికి చేరారు. ఖమ్మం డీసీసీబీ చైర్మన్ పదవి కూడా బీఆర్ఎస్ కోల్పోయింది. ఇటీవల వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుకు చైర్మన్ పదవి లభించింది. ఆయన కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. కొత్తగూడెం మునిసిపాటిలో కొందరు కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్‌లో చేరారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలు బీఆర్ఎస్‌కు సవాల్‌గా మారనున్నాయి. గురువారం ఖమ్మంలో నిర్వహించనున్న సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ క్యాడర్‌కు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎలాంటి భరోసా కల్పిస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

బూర్గంపాడు, మార్చి 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 11న భద్రాచలం పర్యటన నేపథ్యంలో బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో నిర్వహించనున్న సభ ఏర్పాట్లను బుధవారం ఎస్పీ రోహిత్‌రాజ్ పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని పరిశీలించి భద్రత చర్యలకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, సీఐ వినయ్‌కుమార్, ఎస్ఐ సుమన్, నాయకులు పాల్గొన్నారు. అలాగే సభ స్థలాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పోదెం వీరయ్య నాయకులతో కలిసి పరిశీలించారు.

నేటి నుంచి మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 6: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని సిటి బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీర్థాల సంగమేశ్వర స్వామి దర్శనానికి, శివరాత్రి రోజున నిర్వహించే కల్యాణానికి ఈ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బస్సులు నేటి నుంచి ఈ నెల 9 వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కాల్వొడ్డు, దానవాయిగుడెం, కామంచికల్ మీదుగా ఆలయం వరకు బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. చార్జిలు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో మహిళలకు మహాలక్ష్మి పథకం అమల్లో ఉంటుందని తెలిపారు.

ఇసుక తీర్మానాలకు మద్దతు ఇవ్వం

ఆళ్లపల్లి, మార్చి 6: ఉచిత ఇసుక తీర్మానాలకు మద్దతు ఇవ్వమని పలు గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. బుధవారం ఉచిత ఇసుక తీర్మానాల కోసం నిర్వహించిన గ్రామసభలు మూడోసారి కూడా ఆళ్లపల్లి మండలంలో వాయిదా పడ్డాయి. మండలంలోని రాయిపాడు, అనంతోగు, రాఘవాపురం గ్రామాల్లోని కిన్నెరసాని, జల్లేరు వాగులో నుంచి ప్రభుత్వం ఇసుక తీసుకెళ్లందుకు రెండు దఫాలు గ్రామసభలు నిర్వహించినప్పటికీ గ్రామస్థులు తీర్మానాలను వ్యతిరేకించారు. మూడో సారి కూడా అనంతోగు గ్రామంలో కోరం పూర్తికాకపోగా, రాయిపాడు, రాఘవాపురంలో గ్రామస్థులు ఇసుక తీర్మానాలను తిరస్కరించారు.

బీమా పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆందోళన

సత్తుపల్లి, మార్చి6: సత్తుపల్లిలోని ఎస్‌బీఐ ఏడీబీ (పాతసెంటర్)లో రైతులు బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. పంట రుణాలు తీసుకున్న తరువాత పంటల బీమా పేరుతో తమ ఖాతాల నుంచి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేశారని ఆరోపించారు. పెనుబల్లి మండలం ఏరుగట్ల గ్రామానికి చెందిన పలువురు ప్రతిఏటా బీమా చెల్లించాలనే విషయం చెప్పకుండా తమ ఖాతాల నుంచి వేరే ఖాతాలకు డబ్బు మళ్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. పంటల బీమా పేరుతో పంట రుణం ఖాతాల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని ముగ్గురు సిబ్బంది నుంచి రికవరీ చేసి రైతుల ఖాతాలోకి జమ చేస్తున్నామని మేనేజర్ బీ.వేణు వివరించారు. రుణం తీసుకున్న సమయంలో రైతు ఆమోదం ఉంటేనే బీమా సొమ్ము కట్టాలని, లేకుంటే అవసరం లేదన్నారు.

'నష్ట పరిహారం అందించాలి'

కూసుమంచి, మార్చి 6: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే పంటలు ఎండిపోతున్నాయని, పంట ఎండిపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం అందించాలని సీపీఎం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ ఆరోపించారు. పాలేరు పాతకాల్వ ఆయకట్టులో కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారం గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలించి మాట్లాడారు. పాతకాల్వ పరిధిలో సుమారు 4వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మూడుతడులకు నీరిస్తానని చెప్పారని, దీంతో రైతులు పంట సాగుచేశారని తెలిపారు. ఇప్పుడు నీరు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రైతుసంఘ నాయకులు బండి రమేష్, గంగాధర్, షన్మతిరావు, తోటకూరి రాజు, మాజీ సీడీసీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీమా సొమ్ము చెల్లించాలి'

ఖమ్మం లీగల్, మార్చి 6: ఆరోగ్య బీమా పథకం పాలసీ బాధితులకు బీమా పరిహారం చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలతలు బుధవారం తీర్పునిచ్చారు. కేసు వివరాలు.. ఫిర్యాదు దారు ఖమ్మం జిల్లా తల్లాడ మండలం బిల్లుపాడు జగన్నాథపురం గ్రామానికి చెందిన మేడ సత్యనారాయణ స్టార్ హెల్త్ ఎల్లాయిడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా తన కుటుంబ సభ్యులు కలిసి కుటుంబ ఆరోగ్యబీమా పథకం ప్రీమియం చెల్లించి పాలసీ తీసుకున్నారు. కాగా కొంత కాలనికే బాధితుడు అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రి ఖర్చులను చెల్లించాలని సదరు ఇన్సూరెన్స్ కంపెనీని ఆశ్రయించగా, వారు బీమా క్లైమ్‌ను నిరాకరించారు. దీంతో ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌కు నివేదించారు. కాగా కేసుని పరిశీలించి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రకారం బాధితులకు 45 రోజుల్లోపు పరిహారం చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పునిచ్చారు. ఫిర్యాదుదారుని తరపున న్యాయవాది గా వెల్లంపల్లి నరేంద్ర స్వరూప్ న్యాయవాదిగా వ్యవహరించారు.

ఎన్నెస్పీ మైనర్ కాల్వ ఆక్రమణ

వైరా, మార్చి 6: వైరా మునిసిపాలిటీ 14వ వార్డు పరిధిలోని పాత లంబాడీతండా సమీపంలోని రైతువేదికకు కూతవేటు దూరంలో ఉన్న మైనర్ కాల్వను ఓ రియల్ ఎస్టేట్ వెంచర్ నిర్వాహకులు కబ్జా చేశారు. తమ వెంచర్‌కు పక్కనే ఉన్న వైరా మైనర్ 21వ నెంబర్ ఎన్నెస్పీ కాల్వకట్టను ఆక్రమించి ఏకంగా ఫెన్సింగ్ వేశారు. ఈ భూమి విలువ లక్షలాది రూపాయలు చేస్తుందని సమాచారం. వెంచర్ నిర్వాహకులు బఫర్‌జోన్ తీయకుండా కాల్వకట్టను కబ్జా చేశారని, ఈ విషయమై స్థానికులు నీటి పారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఐబీ డీఈ శ్రీనివాస్ తెలిపారు.

విద్యతోనే మహిళాభివృద్ధి

ఖమ్మం కలెక్టరేట్, మార్చి6: విద్య తోనే మహిళాభివృద్ధి సాధ్యం అవుతుందని, బాలికలు చదువుల్లో రాణించాలని డాక్టర్ స్వర్ణకుమారి అన్నారు. ఖమ్మం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘం అధ్యక్షురాలు పీఆర్ దేవి అధ్యక్షత వహించారు. సఖి అడ్మిన్ సరిత మాట్లాడుతూ మహిళల్లో ఎటువంటి ఆత్మీయత భావం అందరికంటే తక్కువనే వైఖరి ఉండకూడదని అన్నారు. అడ్వకేట్ షేక్ నజీమా మాట్లాడుతూ సమాజంలో స్త్రీలకు రక్షణ లేదని అని అన్నారు. ప్రేమలత, మధులత, భూక్య ఉపేంద్ర, కామాన అనంతలక్ష్మీ, భూక్యా మణి, చాట్ల సునీత, కార్యదర్శి రమ్య నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'నామా' విజయం అందరి బాధ్యత

» ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి » బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

ఖమ్మం కార్పొరేషన్, మార్చి 6: బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పేర్కొన్నారు. జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీగా నామా, రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు రవిచంద్ర పార్లమెంట్, రాజ్యసభల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన సమస్యలను ప్రస్తావించటం, కేంద్రమంత్రులను కలిసి సమస్యలను వివరించటం చేశారన్నారు. తప్పనిసరిగా హాజరవటం, సమస్యలను ప్రస్తావించటంలో నామా రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా నిలిచారన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై గురువారం ఖమ్మంలోని మామిళ్లగూడెంలోని వీపీసి ఫంక్షన్‌హాల్‌లో ఖమ్మం పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. అలాగే ఎన్నో క్లిష్ట పరిస్థితులు నెలకొన్నా, వద్దిరాజు రవిచంద్రకు తిరిగి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు, సాయంత్రం 4 గంటలకు ఖమ్మం బైపాస్‌రోడ్‌లోని వద్దిరాజు గ్రౌండ్స్‌లో అభినందనసభ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని తాతా మధుసూదన్ పేర్కొన్నారు. ఒకనాడు ఎల్ఆర్ఎస్‌పై హేళన చేసిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ ఎల్ఆర్ఎస్‌ను అమలు చేస్తామని ప్రకటించారని, ఎటువంటి సొమ్ములు తీసుకోకుండా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య, ఉప్పల వెంకట రమణ, సుబ్బారావు పాల్గొన్నారు.

బూర్జువా పార్టీలతో పొత్తు ఉండదు

● సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రతినిధులు



మాస్‌లైన్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన ప్రదీప్‌సింగ్ ఠాగూర్, సుభాష్ దేబ్, పోటు రంగారావు

ఖమ్మం, మార్చి6(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ ఎన్నికల్లో బూర్జువా పార్టీలతో పొత్తు ఉండదని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు ప్రకటించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఫాసిస్టు బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లను ఓడించాలని పిలుపునిచ్చారు. ఖమ్మం వేదికగా మూడు రోజులపాటు సాగిన సీపీఐ(ఎంఎల్) విప్లవ సంస్థల మాస్‌లైన్ ఆవిర్భావ ఐక్యతా సభలు మంగళవారంతో ముగిశాయి. అనంతరం 21మంది సెంట్రల్ కమిటీ, 9మంది పొలిట్‌బ్యూరో సభ్యులు, ముగ్గురు కంట్రోల్ కమిషన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొని బుధవారం ప్రకటించారు. మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రదీప్‌సింగ్ ఠాగూర్‌ను ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శులుగా త్రిపురకు చెందిన సుభాష్‌దేబ్, తెలంగాణ నుంచి పోటు రంగారావులను ఎన్నుకున్నారు. వారితోపాటుగా కంట్రోల్‌కమిషన్ చైర్మన్‌గా రాయల చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు.

బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బూర్జువా పార్టీలతో పొత్తు ఉండదనీ, ఫాసిస్టు సిద్ధాంతాలను అవలంభిస్తున్న బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడే వారికి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

ఇజ్రాయెల్ ద్వారా జరిగిన మారణహోమ దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజల పక్షాన నిలబడాలని, మణిపూర్‌లో మెయిటీకి వ్యతిరేకంగా ఫాసిస్ట్ విధానాలు అవలంభిస్తోన్న బీజేపీ-ఆర్ఎస్ఎస్ పాలన ప్రాయోజిత హింసను ఖండించాలని కమిటీ తీర్మానించినట్టు తెలిపారు. సమావేశంలో ప్రదీప్ సింగ్ ఠాగూర్, పోటు రంగారావు, సుభాష్ దేబ్, కేజీ రాంచందర్, కె. రమ, అలెక్ చక్రవర్తి, దేవవ్రత శర్మ, దినేష్ గోస్వామి, సంజయ్ సింగ్వి, కెచ్చెల రంగయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులున్నారు.

200 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

బోనకల్, మార్చి 6: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి రాజమండ్రికి బోనకల్ మీదుగా తరలిస్తున్న రేషన్ బియ్యం లోడ్ లారీని మండల పరిధిలోని రావినూతల గ్రామం వద్ద బుధవారం పోలీసులు పట్టుకున్నారు. బియ్యం లోడ్‌తో లారీ వస్తున్న సమాచారాన్ని తెలుసుకున్న ఎస్ఐ మధుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల తనిఖీలు చేయగా పట్టుబడింది. ఏపీ 16 టీవై 6599 నెంబర్ గల లారీలో అక్రమంగా 400 బస్తాలలోని 200 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తాము పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. ప్రాథమికంగా జగ్గయ్యపేటకు చెందిన లారీ డ్రైవర్ షేక్ మస్తాన్, యజమాని షేక్ అనౌతుల్లా, అత్మకూరి జగదీష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైరా ఏసీపీ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదేశాల మేరకు అక్రమ మార్గంలో తరలించే రేషన్ బియ్యం దందా పై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అక్రమ వ్యాపారానికి పాల్పడిన వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు తరుచు నేరం చేస్తూ పట్టుబడితే పీడీ యాక్టు కేసులు పెడతామన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కొమ్మగూడెంలో 36క్వింటాలు...

కారేపల్లి, మార్చి6: మండల పరిధిలోని కొమ్మగూడెంలో బుధవారం అక్రమంగా తరలిస్తున్న 36 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎస్ఐ ఎన్.రాజారాం సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలించేందుకు ప్రయత్నం చేస్తుండగా సమాచారం మేరకు దాడి చేసి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. పట్టుకున్న బియ్యం, వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న బియ్యాన్ని మండల ఆర్ఐ జార్జికి అప్పగించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

● ఐదుగురికి గాయాలు

ముదిగొండ, మార్చి 6: ద్విచక్రవాహనాన్ని టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ముదిగొండ మండలం ఎడవల్లి లక్ష్మీపురం వద్ద బుధవారం చోటు చేసుకుంది. కూసుమంచికి చెందిన పెండ్రా రాము(33) ముదిగొండ నుంచి ద్విచక్రవాహనంపై ఎడవల్లి లక్ష్మీపురం వైపు వెళ్తుండగా, ఎడవల్లి లక్ష్మీపురం నుంచి ముదిగొండ వైపు వస్తున్న టిప్పర్ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ముదిగొండ పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం రూరల్: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనగా యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆరెంపుల వద్ద బుధవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముదిగొండ మండల కేంద్రానికి చెందిన పందిరి గౌతమ్(21) తన స్నేహితుడు విజయ్ కలిసి కారులో వరంగల్ వైపు వెళ్తుండగా, మార్గమధ్యలో ఆరెంపుల వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో గౌతమ్‌కు తీవ్ర గాయాలైయ్యాయి. చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో గౌతమ్ మృతి చెందాడు. వినయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

బూర్గంపాడు: మహబూబాబాద్ నుంచి నలుగు రు వ్యక్తులు బుధవారం ఆటోలో మణుగూరు క్రాస్ రోడ్డు వెళ్తుండగా, బూర్గంపాడు మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామ శివారులో ప్రయాణిస్తున్న ఆటోను ఓ ట్రావెల్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.

మణుగూరుటౌన్: మణుగూరు లారీ అసోసియేషన్ కార్యాలయం నుంచి సాంబాయిగూడెం గూడెం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న లారీ ఓనర్ అండ్ డ్రైవర్ సోంబోయిన పిచ్చయ్య, చావా అచ్యుత్‌లను సాబాయిగూడెం వైపు నుంచి వస్తోన్న లారీ ఢీ కొట్టిం ది. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్ల కలకలం

పాల్వంచ/చర్ల/దుమ్ముగూడెం/గుండాల/అశ్వాపురం, మార్చి 6 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య ఆదివాసీ సంఘం పేరిట వాల్ పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టుల చెరనుంచి మహిళల విముక్తి కోసం పోరాడదామని, దళంలో మహిళలపై లింగ వివక్ష, అత్యాచారాలను వ్యతిరేకించాలని, మహిళలను వంట పని, బ్యాగుల మోత, నాయకుల వ్యక్తిగత పనులకు బానిసలుగా మార్చే పద్ధతి నుంచి విముక్తి కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ, వ్యాపార అవకాశాలను వాడుకొని మహిళలు ప్రగతి సాధించాలని అందులో పేర్కొన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోస్టర్లను విడుదల చేసినట్లు ప్రకటించారు.

భార్య మందలించిందని.. భర్త ఆత్మహత్య

కూసుమంచి, మార్చి 6: భార్య మందలించిందని మనస్తాపం చెంది భర్త బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని గట్టుసింగారం గ్రామపంచాయతీ శివారు గడ్డమీదితండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బాణోతు లింగా (45)అనే వ్యక్తికి మద్యం పూటుగా సేవించే అలవాటు ఉంది. దీంతో విసుగుచెందిన భార్య కమల.. భర్తను మందలించింది. ఈక్రమంలో బుధవారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొంత సేపటికి పొలానికి వెళ్లిన కుమారుడు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. ఈమేరకు భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రామచంద్రారావు బంజర్‌లో ఘర్షణ

● ఎనిమిది మందిపై కేసు నమోదు

పెనుబల్లి, మార్చి 6: యాదవ సంఘం ఎన్నికల సందర్భంగా తనపై ఎనిమిది మంది దాడి చేశారని రామచంద్రారావుబంజర్‌కు చెందిన కారు డ్రైవర్ బొలుసుపాటి రాంబాబు బుధవారం వీఎంబంజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రామచంద్రారావుబంజర్ గ్రామంలో యాదవసంఘం ఎన్నికలు జరిగాయి. రామచంద్రారావుబంజర్ గ్రామానికి చెందిన ఎలమర్తి శ్రీను ఇంటి వద్ద రంగారావుబంజర్ గ్రామానికి చెందిన సోమరాజు సీతరామారావు, భారత నాగేశ్వరరావులు రంగారావుబంజర్ వెళ్తుండగా రామచంద్రారావుబంజర్ గ్రామానికి చెందిన ఎలమర్తి శ్రీను, ఎలమర్తి వెంకటేశ్వరరావు, కోమటి వెంకటేశ్వరరావు, రొంటి నర్సింహా, రొంటి శ్యామ్, ఓరుగంటి సాయి, ఇమ్మడి వెంకటేశ్వరరావు, రొంటి రాములు కారును అడ్డగించి, తనపై దాడి చేశారని, రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారు కూడా ధ్వంసం చేశారని తెలిపాడు. బాధితుడు ఫిర్యాదు ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

- పంట నష్టం రూ.180 కోట్ల దాకా
- సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతోపాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.



నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా

రాజీవ్ స్వగృహ టౌన్‌షిప్ ధరల నిర్ణయానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి: కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 6: రాజీవ్ స్వగృహ జలజ టౌన్‌షిప్ ఆస్తులను ఖచ్చితమైన ధరల నిర్ణయానికి ప్రతిపాదనలు సమర్పించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలో జలజటౌన్‌షిప్ (రాజీవ్ స్వగృహ) గృహసముదాయాల ఆస్తుల ధరలు నిర్ణయించడానికి కలెక్టర్ ఛైర్మన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. మార్గదర్శకాలపై రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్అండ్‌బీ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న 8 టవర్స్ (576), ప్లాట్స్ ఖాళీస్థలాన్ని 2013లో పనిచేపట్టి అసంపూర్తిగా ఉన్నవాటి విలువను నిర్ధారించేందుకు కమిటీ సభ్యులు చర్చించారు. సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించేందుకు కమిటి ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ గౌతమ్ వెల్లడిచారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎస్.ఈ సి.భాస్కర్‌రెడ్డి, ఆర్.అండ్.బి ఎస్ఈ శ్యాంప్రసాద్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ పద్మ, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్‌గోపాల్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పక్కాగా ఉండాలి

ఖమ్మంకార్పొరేషన్: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పక్కాగా ఉండాలని కలెక్టర్ వీపీ. గౌతమ్ ఆదేశించారు. బుధవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభితో కలసి పరిశీలించారు. దరఖాస్తుదారులు ఇచ్చిన కరెంట్‌బిల్, ఆధార్, రేషన్‌కార్డుల వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, పెండింగ్ లేకుండా ఆన్‌లైన్ చేయాలన్నారు. గతంలో దరఖాస్తులు చేసినవారు సరియైన పత్రాలు అందించకుంటే, వారు కేంద్రానికి వచ్చినప్పుడు కావాల్సిన పత్రాల గురించి వివరించాలన్నారు. అలాగే కేవలం ఉచిత విద్యుత్ గురించి వచ్చిన వారికి గ్యాస్ సబ్సిడీపై కూడా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ కంప్యూటర్ ఆపరేటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌పై ప్రశ్నించారు. వారికి పలు సూచనలు చేశారు.

10న రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరికి సన్మానం

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 6: రాజ్యసభకు ఎన్నికైన రేణుకాచౌదరిని ఈ నెల 10న సన్మానించనున్నట్టు ఖమ్మం కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు, స్తంభాద్రి బ్యాంక్ ఛైర్మన్ ఎర్నేని రామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నగరంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో 10న ఉదయం ఎన్వీ రమణ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం అభినందన సభతోపాటు రేణుకాచౌదరికి సన్మానకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కేసీఆర్‌కు వివాహ ఆహ్వానపత్రం అందజేసిన నామా



కేసీఆర్‌కు వివాహపత్రిక అందజేస్తున్న నామా

ఖమ్మంకార్పొరేషన్, మార్చి 6: ఈనెల 15న జరిగే తన రెండో కుమారుడు భవ్యతేజ వివాహానికి రావాలని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు బుధవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే మాజీమంత్రులు కేటీఆర్, హరీష్‌రావులను వారి నివాసాల్లో కలుసుకొని ఆహ్వాన పత్రికను అందజేశారు.

విద్యార్థులు దేశాభివృద్ధికి పాటుపడాలి: పువ్వాళ్ల



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పువ్వాళ్ల

వైరా, మార్చి 6: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి దేశాభివృద్ధికి పాటుపడాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. వైరాలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో పూర్వవిద్యార్థిని కొల్లి కల్పనాచౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొల్లి ఫౌండేషన్‌ను బుధవారం దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఫౌండేషన్ నిర్వాహకురాలు కల్పనాచౌదరి మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం స్కిల్‌డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సులు తమ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటుచేస్తామని తెలిపారు. తాను చదువుతున్న పాఠశాలలో పూర్వవిద్యార్థిగా ఫౌండేషన్ ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. మునిసిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, రెండోవార్డు కౌన్సిలర్ బత్తుల గీత, ప్రిన్సిపాల్ విజయకుమారి, ఫౌండేషన్ సభ్యులు మూడ్ సురేష్, సత్యం, నాయకులు నూతి సత్యనారాయణ, శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ పాల్గొన్నారు.

రూ.7.05కోట్లతో వైరా మునిసిపల్ బడ్జెట్ ఆమోదం

వైరా, మార్చి 6: 2024-2025ఆర్థిక సంవత్సరానికి వైరా మునిసిపల్ బడ్జెట్ రూ.7కోట్ల, 5లక్షల, 42వేలకు ఆమోదం పొందింది. ఛైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన బుధవారం మునిసిపల్ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ బడ్జెట్ అంచనాల్లో ఖర్చు రూ.6కోట్ల, 97లక్షల, 90వేలుగా ఉంటుందని అంచనా వేశారు. రూ.7.48లక్షల నిధులు అంచనాలు రూపొందించారు. మొత్తంగా రూ.7కోట్ల, 5లక్షల, 42వేలకు బడ్జెట్ ఆమోదం పొందింది.

పెంచిన పన్నులను తగ్గించాలి

వైరా మునిసిపాలిటీలో అడ్డగోలుగా పెంచిన పన్నుల భారాన్ని తగ్గించాలని మునిసిపల్ వైస్‌ఛైర్మన్ ముళ్లపాటి సీతరాములు పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఎలాంటి శాస్త్రీయత లేకుండా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా వందశాతం పన్నులు పెంచటాన్ని తీవ్రంగా నిరసించారు. వెంటనే పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు.


బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం అధ్యక్షుడి అరెస్ట్

ఖమ్మం క్రైం, మార్చి 6: ఖమ్మం బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు దేవభక్తిని కిషోర్‌ను బుధవారం ఉదయం ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత ఏడాది మే 28న ఎన్‌టీఆర్ జయంతిని ఖమ్మంనగరంలోని ఎన్‌టీఆర్ సర్కిల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు, సోషల్ మీడియా యాక్టివ్ పర్సన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన చీకటి కార్తీక్ కూడా పాల్గొన్నాడు. అక్కడ బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు కార్తీక్‌పై దాడిచేశారు. కాగా బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు కిషోర్ తోపాటు ఖమ్మం నగరానికి చెందిన రామునాయుడు, వీరేంద్రగౌడ్, ప్రదీప్, సందీప్, సురేష్ అనే వారు దాడి చేశారని, అదేవిధంగా కులం పేరుతో దూషించారని ఈ దాడిలో తన కాలు విరిగిందని కార్తీక్ పోలీసులకు గత ఏడాది మే 30న ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన టూటౌన్ పోలీసులు కులం పేరుతో దూషించటంతో పలు సెక్షన్లకింద కిషోర్‌ను అదుపులోకి తీసుకొని న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి కిషోర్‌కు 14 రోజులపాటు రిమాండ్ విధించటంతో పోలీసులు కిషోర్‌ను జిల్లా జైలుకు తరలించారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగునీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్‌హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారనికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్లు మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్ల మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

కాలుష్య నియంత్రణ బోర్డులో అవినీతి అధికారులు

- మండిపడిన హైకోర్టు
- సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ఫ్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీచేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. చట్టంలోని నిబంధన ప్రకారం ప్లాస్టిక్ వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చింది. కంపెనీ ఇచ్చిన వివరణను పట్టించుకోకుండా, తమ నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. మూసివేత ఆదేశాలను సవాల్ చేస్తూ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. 'రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఇదో బాధాకరమైన విషయం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా మార్చాలి. గత ఏడునెలలుగా మేం పీసీబీ పనితీరును గమనిస్తున్నాం. కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు.. మరి కొంత మంది అధికారులు వచ్చి ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి' అని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీచేసిన మూసివేత ఉత్తర్వులు చెల్లవని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ రాజకీయం!

- కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని... ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్ఎస్ బలహీనపడింది

- పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా... అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటర్ల వివరాలు ఇవ్వండి

- ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఇంటినంబర్లతో కూడిన మ్యాప్ (నజ్రీ నక్ష)లను మాజీ ఎంపీ, ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అందజేయాలని ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ గతేడాది జారీచేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం నజ్రీ నక్ష అందజేయాల్సి ఉండగా అందుకు ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 2.40 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో 1.65 లక్షల మంది వరకు ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఇంటి నెంబర్లతో కూడిన నజ్రీ నక్షలను బయటపెట్టకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ.. ఫొటోలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏరియాను ప్రతిబింబించే నజ్రీ నక్షను ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. తగిన మొత్తంలో రుసుము చెల్లిస్తే పిటిషనర్‌కు నక్ష అందజేయడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఖర్చులు స్వీకరించి పిటిషనర్ కోరిన విధంగా నజ్రీ నక్ష అందజేయాలని ఆదేశించింది.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అథఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే.! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్ల పొదలు, ముళ్ల కంపలు తప్ప. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు

హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో 'రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బేవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రైవేటు ఏజెన్సీలతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్‌కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్‌కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాబు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించినట్లు ఆరోపణలున్నాయి.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాతాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యూవల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.

భద్రాద్రి కొత్తగూడెం
ANDHRAJYOTHY ఆంధ్రజ్యోతి
గురువారం 7 మార్చి 2024

మేలు జాతి దూడల ప్రదర్శన

పాల్వంచ రూరల్, మార్చి 6: ఐటీసీ బంగారు భవిష్యత్ ప్రోగాం ద్వారా భైప్ స్వచ్ఛంద సంస్థ వారు బుధవారం పాండురంగాపురం గ్రామంలో మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిసి అధికారి సాగర్ మాట్లాడుతూ.. పశు కృత్రిమ గర్భం కార్యక్రమం వలన కలిగే లాభాలను, పాడి పశువుల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులను పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఐటీసీ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకొని ప్రజలు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. పశు కృత్రిమ గర్భం ద్వారా రైతు ఇంటి ముంగిటనే అధిక పాలధారను కలిగిన దూడలు పుట్టి పాడి రైతులు లాభాలు పొందవచ్చు అని అన్నారు. రైతులు పశుగ్రాసాలు పెంచుకోవడం ద్వారా పాల దిగుబడి పెంచుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో భైప్ సంస్థ అధికారి గోపాల్‌రెడ్డి, మీరజ్, హేమంత్, సదయ్య తదితరులు ఉన్నారు.

'తెల్లం' వ్యాఖ్యలపై కాంగ్రెస్ గరం..గరం..

- ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేసిన నాయకులు
- నిబద్ధత గల నాయకుడు వీరయ్యను విమర్శించే స్థాయి లేదని నేతల ధ్వజం
- దుమ్ముగూడెం, చర్లలోనూ ఆందోళనలు

భద్రాచలం, మార్చి 6: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రచార మాధ్యమాల వేదికగా డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు పొదెం వీరయ్యపై చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు బుధవారం అంబేద్కర్ సెంటర్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఊసరవెల్లిలా రోజుకో పార్టీ మారే తెల్లం నీకంటే ఊసరవెల్లి నయమన్నారు. పూటకో పార్టీ మార్చే ఎమ్మెల్యేకు నీతినిబద్ధత గల పొదెం వీరయ్యను విమర్శించే స్థాయి లేదన్నారు. నిన్నగాక మొన్న శాసన సభ్యునిగా గెలిచిన తెల్లం గడిచిన దశాబ్దకాలంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆ పార్టీకి బాధ్యత వహిస్తూ భద్రాచలం నియోజకవర్గ సమస్యల గురించి ఏనాడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు.

సీఎంను కలిస్తే మీకు ఇబ్బంది ఏమిటి..?

ఎమ్మెల్యే దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు తగలబెట్టడాన్ని బీఆర్‌ఎస్ మండల నాయకులు ఖండించారు. బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు అరికెల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తిలు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ తగలబెట్టడం సిగ్గుమాలిన చర్యని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కట్టుబడి ఉన్నారని ఇది నచ్చని కాంగ్రెస్, టీడీపీ నాయకులు అవాకులు చెవాకులు పేలడాన్ని ఖండిస్తున్నామన్నారు. భద్రాద్రి అభివృద్ధికి సీఎంను కలిస్తే కాంగ్రెస్ నాయకులకు వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. పొదెం వీరయ్య ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో డాక్టర్ తెల్లం వెంకట్రావును గెలిపించారని గుర్తు చేశారు.

చర్లలో..

చర్ల: చర్ల మండల కేంద్రంలో బుధవారం చర్ల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయభాష్కర్ రెడ్డి మాట్లాడుతూ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పొదెం వీరయ్యపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖడిస్తున్నామన్నారు. అప్పటి ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ముఖ్యమంత్రికి దృష్టికి సమస్యలను తీసుకుపోలేదు అనడం సరికాదన్నారు. చేసిన వ్యాఖలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ కార్యకర్తలు మడకం పద్మజ, సరియం రాధ, బందారు రామకృష్ణ, గుండెపూడి భాష్కర్‌రావు, ఇర్పా శ్రీను, సాల్మన్ రాజ్, రుంజా రాజా తదితరులు ఉన్నారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: భద్రాచలం ఎంఎల్‌ఏ డాతెల్లం వెంకట్రావు మాజీ ఎంఎల్‌ఏ పొదెం వీరయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మండల కాంగ్రెస్ శ్రేణులు బుధవారం లక్ష్మీనగరం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై రాస్తారోకో, దిష్టిబొమ్మ దహనంతో నిరసన తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు మాట్లాడుతూ, సీఎంగా కేసీఆర్ ఉన్న కాలంలో భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి ఎటువంటి నిధులు ఇవ్వకపోవడం ప్రజలకు తెలుసన్నారు. నిధులివ్వకుండా పొదెం వీరయ్య హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఎంఎల్‌ఏ వెంకట్రావు అనడం ఏంటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పాలనలో మంత్రులకు, ఎంఎల్‌ఏలకు కూడా సీఎం కేసీఆర్‌ను కలిసే అవకాశం లేదని విమర్శించారు. నాలుగుసార్లు పార్టీ మారిన డాక్టర్ వెంకట్రావు డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యను విమర్శించే హక్కులేదని అన్నారు. నాయకులు సాంబశివరావు, వెంకటరమణారెడ్డి, కనుబుద్ది దేవా, సుధాకర్, శ్రీను, మారయ్య, సందీప్‌రెడ్డి తదితరులున్నారు.



భద్రాచలంలో తెల్లం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

అవసరాలకనుగుణంగా అభివృద్ధి: కూనంనేని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

లక్ష్మీదేవిపల్లి, మార్చి 6: ప్రజల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా పల్లెల్లో అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వివిధ పథకాల కింద లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని సాటివారిగూడెం, చాతకొండ, హమాలీ కాలనీ, శ్రీనగర్‌కాలనీ, ప్రశాంతినగర్, లోతువాగు, అనిశెట్టిపల్లి గ్రామాలకు మంజూరైన రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి అనంతరం మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో ఉండే తనకు సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, ప్రజల నుంచి విజ్ఞప్తులు రాకపోయినప్పటికీ సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణమే కాకుండ వచ్చే వేసవిని ఎదుర్కొనేందుకు కావాల్సిన తాగునీటి పథకాలకు ప్రతిపాదనలను సిద్ధం చేసి సంబంధిత శాఖల మంత్రులకు, అధికార యంత్రాంగానికి అందించామని, ఈ నీటి పథకాలకు త్వరలో కోటిరూపాయలు మంజూరు లభించనుందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, నాణ్యతలో తేడాలు వస్తే సహించేది లేదని హెచ్చరించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

ములకలపల్లి, మార్చి 6: ములకలపల్లి మండలంలోని గ్రామాల్లో మీ ఎమ్మెల్యే మీ ఇంటికి అనే కార్యక్రమం ద్వారా 24మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు బుధవారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ములకలపల్లి రైతువేదిక వద్ద రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిశుక్ర, మంగళవారాల్లో జరిగే రైతులు ట్రైనింగ్ ప్రోగ్రాం వీడియో కాన్పరెన్స్‌లో వ్యవసాయానికి సంబంధించిన శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల తహసిల్దార్ పుల్లారావు, మండల వ్యవసాయ అధికారి కరుణమయి, కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి, తిరుపతిరెడ్డి, కరుటూరి కృష్ణ, కారం సుధీర్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

'మొల్ల' ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్, మార్చి 6 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మొల్ల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గుట్టమల్లారం పల్లె పకృతి వనంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిధిగా హజరై మహిళలకు ముందస్తు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మొల్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ప్రభుత్వ పేదల పక్షపాతి అని, ప్రకటించిన ఆరు గ్యారెంటీలన కచ్చితంగా అమలు చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన మహిళలను శాలువాలతో సత్కరించారు. అనంతరం మహిళా దినోత్సవ కేక్‌ను కట్ చేసారు. కార్యక్రమలో సంస్థ వ్యవస్థాపకులు రెరుకుమల్లి ఉపేందర్‌రావు, జీ బాలకృష్ణ, ఇళ్ల లక్ష్మణ్, బర్ల నాగమణి, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

పాల్వంచ, మార్చి 6: పాల్వంచ తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ప్రియాంక అల బుధవారం సందర్శించారు. ధరణి స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఇప్పటి వరకు రైతుల నుంచి ఎన్ని ధరఖాస్తులు వచ్చాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారులు బృందాలుగా ఏర్పడి ఈ నెల 9వరకు చేపడుతున్న స్పెషల్ డ్రైవ్‌లలో ఆర్డీఓలు, తహశీల్దార్‌లు ప్రత్యేక శ్రద్ధతో తమ తమ కార్యాలయల్లో ధరణి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పాల్వంచ మండలంలోని భూముల వివరాలు, సర్వే నెంబర్లు, పాస్‌పుస్తకాల్లో తప్పులు తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. స్పెషల్ డ్రైవ్‌లో వచ్చే ప్రతి ధరఖాస్తును పరిష్కరించాలని తహశీల్దార్ వివేక్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్, సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న పీఠాధిపతి

మణుగూరు, మార్చి 6: మణుగూరు మండలంలోని సమితి సింగారం గ్రామంలోని కోదండ రామాలయం ధ్వజస్తంభ, శివలింగ ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం వైభవంగా జరిగాయి. హంపి పీఠాధిపతి జగద్గురు ఆది శంకరాచార్య శిష్యులు విద్యారన్య భారతి మహాస్వామి ఆధ్వర్యంలో వారి శిష్య బృందం ఈ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మణుగూరు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు దంపతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజల్లో పాలు పంచుకున్నారు. ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో కూడా పాల్గొన్నారు. అనంతరం భక్తుల కోసం కోదండ రామాలయ కమిటీ సభ్యులు నాలువేల మందికి మహా అన్నదాన ప్రసాద వినియోగాన్ని చేశారు. భక్త జన సందోహంతో ఆలయం కిక్కిరిసి పోయింది.

శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించండి: జలగం



అన్నపురెడ్డిపల్లి, మార్చి 6: అన్నపురెడ్డిపల్లిలోని భ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి జలగం ప్రసాదరావు కోరారు. బుధవారం ఆయన శివాలయంలో స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రికి ముస్తాబౌవుతున్న ఆలయాన్ని సందర్శించి కాంగ్రెస్ నాయకులతో ముచ్చటించారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా నాయకులు పర్సా వెంకటేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు వనమాగాంధీ ఉన్నారు.

ఐఎస్‌జీఎఫ్ ఉమెన్స్‌గిల్డ్ ప్రమాణ స్వీకారం



ఎన్నికైన నూతన కార్యవర్గం

కొత్తగూడెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పెలోషిప్ (ఐఎస్‌జీఎఫ్) ఉమెన్స్ గిల్డ్ ఆవిర్భావ ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. బుధవారం కొత్తగూడెంలోని తాటిపల్లి రెసిడెన్సిలో ఏర్పాటు చేసిన ఎస్‌జీఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశంలో రాష్ట్రంలోనే తొలిసారిగా ఉమెన్స్‌గిల్డ్‌ను ఏర్పాటు చేశారు. ఎస్‌జీఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు లోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాసీం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సింగరేణి రిటైర్డ్ అధికారి, బీఎస్‌జీ కమిషనర్, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణారావు గౌరవ అతిధిగా పాల్గొని ఉమెన్స్‌గిల్డ్ కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు సీడీపీవో కనకదుర్గ, కోశాధికారి చిట్టిమల్ల బ్రహ్మంచారి, మహిళ కార్యదర్శులు జ్యోతిరాణి, జరీనాలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఇదే..

జిల్లా అధ్యక్షురాలిగా డాక్టర్ నూరి మెహరున్నీసా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీహెచ్. శ్వేతా, కోశాధికారిగా సోనా, జిల్లా ముఖ్య సలహాదారులుగా ఐసీడీఎస్ సీడీపీవో కనకదుర్గ, హెచ్‌ఎంలు ఎం. జ్యోతిరాణి, జరీనా బీ, జిల్లా ఆర్గనైజర్లుగా హేమావతి, ఉమానసీమ్ పాషాలు ప్రమాణ స్వీకారం చేశారు. సింగరేణిలో అధికారిగా పని చేసి పదవీ విరమణ చేసిన, బీఎస్‌జీలో ఉప రాష్ట్రపతి అవార్డుగ్రహీత హేమావతిని, ఉత్తమ సీడీపీవో అవార్డు గ్రహీత కనకదుర్గను ఉమెన్స్‌డే సందర్భంగా ముందస్తుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కల్చరల్ విభాగం కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిర్లాపురం పిసా గ్రామసభ వాయిదా

మణుగూరుటౌన్, మార్చి 6 : సింగరేణి మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ విస్తరణకై బుధవారం తిర్లాపురం గ్రామ పంచాయతీలో నిర్వహించి పిసా గ్రామసభ వాయిదా పడింది. రామానుజవరం పంచాయతీలో రైతులు ఏమైతే నష్టపరిహారంగా డిమాండ్ చేశారో అదేవిధంగా తిర్లాపురం పంచాయతీలోని భూములను కోల్పోయే రైతులు అదే డిమాండ్ చేశారు. భూమికి బదులుగా భూమితోపాటు నిర్వాసితలయ్యే రైతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో గ్రామసభలో అధికారుల తీర్మాణాన్ని రైతులు వ్యతిరేకించారు. ఈ సందర్భంగా భూ సేకరణ ప్రత్యేక అధికారి, సబ్ కలెక్టర్ టీ సుమ మాట్లాడుతూ.. భూములు కోల్పోయే రైతుల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతామని, అప్పటి వరకు కనీసం సర్వేకు సహకరించాలని కోరారు. నష్టపరిహారం తేలే వరకు అంగీకరించేది లేదని రైతులు తేల్చి చెప్పడంతో గ్రామసభ వాయిదా పడింది. తిరిగి గ్రామసభ నిర్వహించే తేదీని ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న భూసేకరణ ప్రత్యేక అధికారి సుమ

ఎమ్మెల్యేకు ఔట్ సోర్సింగ్ వైద్య సిబ్బంది వినతి

మణుగూరుటౌన్, మార్చి 6: మణుగూరు ప్రభత్వ వంద పడకల ఏరియా ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో పనిచేస్తోన్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుదవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తోన్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలసి వినతి పత్రమందజేశారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

అశ్వాపురం, మార్చి 6: అశ్వాపురం పారెస్ట్ రేంజ్ పరిధిలోని ఇరవెండి సెక్షన్ నెల్లిపాక బ్లాక్ తుమ్మలచెరువు కంపార్ట్‌మెంట్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ ఉపాధిహామీపథకం పనులపై బుధవారం అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ పనుల్లో భాగంగా వందలాది మంది కూలీలతో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. ఈ నేపథ్యంలో అధికారులు సామాజిక తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో బ్లాక్ రిసోర్స్ పర్సన్ కృష్ణంరాజ్, విలేజ్ రిసోర్స్ పర్సన్ వెంకట నర్సమ్మ, శ్రావణి, బీట్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చలి వేంద్రం ఏర్పాటు

మణుగూరు, మార్చి 6: మణుగూరు మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రాఘవ రెడ్డి బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మన హక్కుల కోసం మనమే కదం తొక్కాలి

పాల్వంచ టౌన్, మార్చి 6: మనహక్కుల కోసం మనమే కదంతొక్కాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ జి.పద్మ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా బుధవారం లారీ అసోసియేషన్ హాలులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో పట్టణ కన్వీనర్ కే. సత్య, సూపర్‌వైజర్ దీప, ఐద్వా పట్టణ అధ్యక్షులు క్రాంతి, రమ్య, అచ్చి, కృష్ణవేణి, ముంతాజ్, లక్ష్మీ, నాగమణి, రమాదేవి, సావిత్రి, ఆశా, పీహెచ్‌సీ నాయకులు రమణ పాల్గొన్నారు.

ప్రజాపాలన కాంగ్రెస్‌కే సాధ్యం: కొత్వాల

పాల్వంచ రూరల్, మార్చి 6: తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన కాంగ్రెస్‌కే సాధ్యమని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ఆరు గ్యారంటీలలో భాగంగా గృహజ్యోతి 200 యూనిట్లు లోపు వారికి ఉచిత కరెంట్ పథకం జీరో బిల్లులను బుధవారం జగన్నాథపురం గ్రామంలో ఆయన ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాల్వంచ విద్యుత్ శాఖ రూరల్ ఏఈ నరేందర్, తులసీ రామ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక ధర పలికిన వర్జీనియ పొగాకు

అశ్వారావుపేట, మార్చి 6: టుబాకోబోర్డు జంగారెడ్డిగూడెం ప్లాట్‌పారమ్‌లో వర్జీనియా పొగాకు కొనుగోళ్ళన బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్, ఐఎఎస్ బుధవారం ప్రారంభించారు. ఏపీఎఫ్ 32 నందు జరిగిన వేలంలో మొదటిరోజు జరిగిన వేలంలో వర్జీనియా పొగాకు ధర అత్యధికంగా కిలో రూ.240లు పలికింది. తొలిరోజు జరిగిన కొనుగోళ్ళలో 99మంది రైతులకు చెందిన బేళ్ళు అమ్ముడుపోయాయి. ఐటీసీ, జీపీఐ, అలియన్స్ ఒన్ ఇండస్ట్రీస్, ప్రగతి టుబాకో కంపెనీ, యార్లగడ్డ ఎక్స్‌పోర్ట్స్, మోడల్ ర్యాగ్ ఎక్స్‌పోర్ట్స్, బొమ్మిడాల ఎంటర్ ప్రైజెస్ కంపెనీలు పాల్గొని పొగాకును కొనుగోళ్ళు చేసారు. ఈ సందర్భంగ జంగారెడ్డిగూడెం ప్లాట్‌పారమ్ వేలం నిర్వహణాధికారి సురేందర్ మాట్లాడుతూ ఈ ఏడాది 10.64 మిలియన్ కిలోల పొగాకు అథరైజేషన్ ఇవ్వడం జరిగిందని, రైతులు 14.50 మిలియన్ టన్నులు పండించినట్లు అంచనా వేసినట్లు ఆయన తెలిపారు.

కనకదుర్గమ్మ ఆలయంలో విశేష పూజలు

అశ్వారావుపేట రూరల్, మార్చి 6: మండలంలోని గుర్రాలచెరువు గ్రామంలో గల స్వయంభూ కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారికి విశేష పూజలు జరిపారు. 108 కలశాలతో అమ్మవారికి అష్టోత్తర శత మహా కలశాభిషేకాన్నిన అత్యంత భక్తిశ్రద్దల మధ్య జరిపారు. అనంతరం ఆలయంలో విజయదుర్గా హోమాన్ని ఘనంగా జరిపారు. ఈసందర్భంగా అమ్మవారిని అందంగా అలంకరించారు.

సీఎండీకి అధికారుల వినతి



జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

మణుగూరుటౌన్, మార్చి 6: కోల్‌మైన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సింగరేణి బ్రాంచి నూతన అధ్యక్షులు, మణుగూరు ఏరియా పీకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మీపతిగౌడ్ సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న అధికారుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి సీఎండీ బలరాంకు విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరబాద్‌లో సింగరేణి వ్యాప్త అధికారుల సంఘం నాయకులు, అధికారులతో సీఎండీ నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం సీఎండీ బలరాంను అధికారుల సంఘం నాయకులు, అధికారులు ప్రత్యేకంగా కలిసారు. నూతనంగా సీఎండీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సీఎండీకి శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సీఎంఏఐ అధ్యక్షులు లక్ష్మీపతిగౌడ్ సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న అధికారుల సమస్యలను, విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకుపోయారు. సంస్థలో 24 గంటలు పనిచేసే అధికారులకు కూడా తగిన ప్రోత్సాహం కల్పించాలని కోరారు. అధికారులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు, ఉన్నత చదువులు చదివే అధికారుల పిల్లలకు ఫీజు రియంబర్స్‌మెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎండీ బలరాం మాట్లాడుతూ.. సమస్యలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జీఎం కో ఆర్డినేషన్ ఎం.సురేష్, అధికారుల సంఘం ఉపాధ్యక్షులు పొనుగోటి శ్రీనివాస్, రాజీవ్‌కుమార్, సహాయ కార్యదర్శులు కిరణ్ రాజ్ కుమార్, సీహెచ్ రాజగోపాల్, కోశాధికారి నరేష్, సహాయ కార్యదర్శి రాజగోపాల్‌లతో పాటు అన్ని ఏరియాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రైళ్లను పునరుద్ధరించాలి

మణుగూరు, మార్చి 6: మణుగూరు రైల్వే స్టేషన్ నుంచి రద్దు చేసిన రైలు సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ, ఏఐటియూసీ డిమాండ్ చేశాయి. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏఐటియూసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్‌లు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామనరసయ్యలు మాట్లాడారు.

టిప్పర్, లారీ అసోషియేషన్ ఏర్పాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందుటౌన్, మార్చి 6: ఇల్లెదు డివిజన్ టిప్పర్, లారీ అసోషియేషన్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ఇల్లెందులో అసోషియేషన్ నూతన కమిటిని ఎన్నుకున్నారు. సింగరేణి ఇల్లందు ఏరియా జెకె 5 ఓసీ, కోయగూడెం ఓసీల నుంచి వివిధ ప్రాంతాలకు బొగ్గును రవాణ చేసే లారీ ఓనర్లు, నూతనంగా అసోషియేషన్‌ను ఏర్పాటు చేశారు. అసోషియోషన్ ఇల్లందు డివిజన్ గౌరవ అధ్యక్షుడిగా కోరం సురేందర్, అధ్యక్షులగా నెలవేల్లి నర్సింహరావు, ఉపాధ్యక్షుడు బోడ మంగిలాల్, ప్రధాన కార్యదర్శిగా అర్వ వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా గోపి, రవి, కోశాధికారిగా గుర్రం రామారావు, ప్రచారా కార్యదర్శిగా మోహన్‌లతో పాటు మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ- అసోషియేషన్‌లో ఉన్న సభ్యులు ఐక్యంగా ఉండాలన్నారు. సింగరేణి యాజమాన్యం ద్వారా వచ్చె సౌకర్యాలను పొందేందుకు తగిన విధంగా కృషి చేస్తామని వెల్లడించారు. బొగ్గురవాణలో ఏలాంటి సమస్యలు ఎదురైతే ఐక్యంతో పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేవ్వరావు, బాడిలారీ అసోషియోషన్ అధ్యక్షుడు మౌలానా, చిట్టిబాబు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ డీఎస్పీగా సతీష్‌కుమార్

పాల్వంచ, మార్చి 6: పాల్వంచ డీఎస్పీగా ఆర్. సతీష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన వెంకటేష్‌ను ఖమ్మం స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. హైదరాబాద్ సీసీఎస్‌లో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సతీష్‌కుమార్‌ను డీఎస్పీగా నియమించారు.

కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో ఎంపికలు



ఎంపికలను పరిశీలిస్తున్న డీడీ మణెమ్మ

పాల్వంచ రూరల్, మార్చి 6: ఐటీడీఏ భద్రాచలం గిరిజన శాఖ పరిధిలోని గిరిజన శాఖ క్రీడా పాఠశాలల్లో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ రెండు రోజుల పాటు కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో ముమ్మరంగా సాగింది. క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను బుధవారం ఐటిడిఏ డీడీ మణెమ్మ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.. గిరిజన విద్యార్థులు క్రీడలలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ అందిస్తున్న సదుపాయాలను, సౌకర్యాలను వినియోగించుకొని జీవితంలో ఎదగాలని అన్నారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో క్రీడల్లో రాణించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం 2శాతం రిజర్వేషన్ క్రీడా కోటా కల్పిస్తుందన్నారు. బుధవారం 120 మంది బాల బాలికలు పాల్గొన్నారని అన్నారు. కార్యక్రమంలో క్రీడల జిల్లా అధికారి గోపాలరావు, రాష్ట్ర గిరిజన వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఏఎస్‌వోలు వెంకటనారాయణ రాంబాబు, నాగేశ్వరరావు, పీడీలు పి.రాంబాబు, హరికృష్ణ వెంకటేశ్వర్లు, కృష్ణరావు, రవి, కోచ్‌లు తదితరులు ఉన్నారు.